
# ప్రాక్టికల్ జోక్

తిరుమలశ్రీ



రాత్రి పదకొండు గంటలైంది. అప్పుడే పర్మానుష్యమైపోయాయి.
చలికాలం మూలాన రోడ్లు సౌత్ బీచ్ రోడ్‌లో 'అన్నా

సమాధికెదురుగా పేవ్‌మెంట్ మీద విలుచుందామె. సన్నవి పొడవైన విగ్రహం. అందమైన రూపం.... తెల్లనిచీర, జాకెట్టూ... విరబోసుకున్న కురులూ....

సముద్రపుగాలికి రెప రెపలాడుతూన్న చీర, ఎగురుతూన్న కురులూ... ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుందామె.

కొంతసేపటికి పారిస్ వైపు నుండి అంబాసడర్ కారు వేగంగా వచ్చింది అటువైపు. రోడ్డుమీదకు వెళ్ళి చేయిచాపి కారాపిందామె. కారులో వున్నది సర్దార్‌జీ.

స్వయంగా డ్రయివ్ చేసుకొంటున్నాడు కారును.

"కెనయ్ గెట్ ఎ లిఫ్ట్ ప్లీజ్?" అందామె మృదుమధుర స్వరంతో. ఆవేళప్పుడు ఆమెను అక్కడ ఒంటరిగా చూసి ఆశ్చర్యపోయాడతను

"వెల్‌కం" అంటూ ఫ్రంట్ డోర్ తెరిచాడు. తటపటాయిస్తూనే అతని ప్రక్కన కూర్చున్నదామె.

కారు కదిలింది.

"ఎక్కడికి వెళ్ళాలి?" అడిగాడతను. "ఫోర్‌షోర్ ఎస్టేట్" అందామె.

"నేను అడయారుకు వెళుతున్నాను" అన్నాడు. కొద్ది క్షణాలు వారి మధ్య నిశ్శబ్దం. కారు వేగం తగ్గించి నెమ్మదిగా పోనిస్తున్నాడతను.

ఆశ్చర్యపోయిందామె.

సర్దార్‌జీకి ప్రాక్టికల్ జోక్స్ వేయడమంటే సరదా. ఆ సమయంలో ఒంటరిగా తనకారెక్కిన ఆ యువతి ధైర్యానికి లోలోపలే ఆశ్చర్యపోయాడు. ఆమె మీద ఏదైనా ప్రాక్టికల్ జోక్ వేయాలనిపించింది.

బీచ్ నుండి చలిగాలి వీస్తోంది. సముద్రపు హోరు ఎడతెరిపి లేకుండా సంగీతం పాడుతోంది.

ఉన్నట్లుండి చిరునవ్వుతో అన్నాడతను. "మిస్! నా గురించి చెబుతాను వింటారా?"

ఆమె ఆశ్చర్యం ఇనుమడించింది.

"నేనొక భగ్న ప్రేమికుణ్ణి. కొన్నాళ్ళక్రితం సీలాగే అందంగా వుండే ఓ అమ్మాయిని ప్రేమించాను. నాతో తిరిగింది. నా డబ్బు ఉపయోగించుకొందామె. చివరకు నన్ను మోసగించి మరో యువకుణ్ణి పెళ్ళిచేసుకొని వెళ్ళిపోయింది.. అప్పటినుండీ ఆడవాళ్ళంటే అసహ్యం నాకు. అందమైన ఆడదానినల్లా నాశనం చేయాలన్న కసి. అందుకే ఒంటరిగా

చిక్కిన యువతులపైన నా కక్ష తీర్చుకొంటాను."

ఉలిక్కిపడిందామె. కలవరపాటును వదనంలో కన్పించనీయకుండా జాగ్రత్తపడింది.

ఆగి, ఆమె ముఖంలోకి చూసి మళ్ళీ అన్నాడతను. "పెద్ద మనిషిలా చెలామణీ అవుతూన్న ఓ క్రూక్ నేను। ఇలా రోజూ రాత్రులు బాగా ప్రొద్దుపోయాక కారేసుకొని రోడ్లమ్మట తిరుగుతూంటాను నీలా ఒంటరిగా ఆడవాళ్ళెవరైనా కనిపిస్తే లిఫ్టు వంకతో కార్లో ఎక్కించుకొంటాను. తర్వాత వాళ్ళని రేప్ చేసి విడిచిపెడతాను. ఆవిధంగా ఆడవాళ్ళమీద కసి తీర్చుకోవడం నా హాబీ అయిపోయింది."

కారు ఇంకా నెమ్మదిగానే వెళుతోంది. ఆమెలో అతను ఎదురుచూపిన రియాక్షన్ కనిపించకపోయేసరికి ఆశ్చర్యపోతూ

"నువ్వు చాలా అందంగా ఉన్నావు. ఇప్పుడు కారు నిర్మానుష్యంగా వున్న ఓ ప్రదేశంలో ఆపుతాను. నీ అందాన్ని తనివితీర అనుభవిస్తాను. కసితీరేలా నిన్ను రేప్ చేస్తాను. నీవంటి అందగత్తెలు పురుషుల్ని పిచ్చి వాళ్ళనుచేసి ఏడిపించకుండా బుద్ధి చెబుతాను" పిచ్చిగా నవ్వాడతను, ఆమె వెనుకనుంచి చేయివేస్తూ.

కాని తాను ఆశించిన ఎఫెక్ట్ ఆమెలో కన్పించకపోవడంతో అతని ఆశ్చర్యం పెరిగింది. నిజంగా ఆమె భయపడివుంటే, ఆ భాయమేదీ ఆమె వదనంలో కనిపించలేదు.

తన పలుకులు వింటూనే అదిరిపడి, కాపాడమని గోల చేస్తుందనీ భయంతో కేకలు పెడుతుందనీ పరుగిడుతూన్న కార్లోంచి క్రిందకు దూకేస్తుందనీ తలపోసాడతను.

కాని, ఏమీ జరగనట్టు ప్రశాంతంగా కూర్చున్నదామె.

ఆమె ధైర్యానికి, గుండె దిటవుకూ లోలోపలే అభినందించకుండా ఉండలేకపోయాడు.

ముందుకు జరిగి కూర్చుందామె.

"నా కథ కూడా వినండి మరి" అంది నెమ్మదిగా.

సముద్రపు గాలి జివ్వుమంటూ రివ్వున చెవులకు సోకుతూంటే చలిచలిగా వుంది. గాలికి ఆమె ముంగురులు ముఖంమీదకు ఎగురుతూ చంద్రుడితో దాగుడుమూతలాడుతున్న మేఘ శకలాలను తలపుకు తెస్తున్నాయి.

"ఓహ్, నీకూ ఓ కథ వున్నదన్నమాట। నీలాంటి అందగత్తెను

ప్రక్కన పెట్టుకుని పూరికే కూర్చోవాలంటే మాటలు కాదు. చెప్పదలచుకున్నదేమిటో త్వరగా కానియ్యి" అన్నాడు అసహనంగా.

కారు ఐస్‌హౌస్ దాటింది.

"నా పేరు అంబిక. క్వీన్ మేరీస్ కాలేజీలో చదివేదాన్ని. మూణ్ణెల్ల క్రితం ఓసారి ఒంటరిగా బీచ్‌కి వెళ్ళాను. అన్నా సమాధి దగ్గర ఇసుకలో దూరంగా కూర్చుని ఎగసిపడే అలల సోయగాలను చూస్తోంటే టైమ్ తెలియలేదునాకు. జనమంతా వెళ్ళిపోయినట్టుగాని, నిర్మానుష్యంగా వున్న ఆ ప్రదేశంలో నేను ఒంటరిగా మిగిలి పోయినట్టుగాని గమనించలేదు నేను. అలా ఎంతసేపు వున్నానో నాకే తెలియదు...." ఆగిందామె.

కుతూహలంగా చూసాడతను.

"హఠాత్తుగా ముగ్గురు యువకులు వచ్చి మీద పడేంతవరకు నేనున్న పరిస్థితిని అవగాహన చేసుకోలేకపోయాను. ఒంటరిగా దొరికిన నామీద అత్యాచారం చేసారు వాళ్ళు. ఎంత బ్రతిమాలినా వినకుండా దారుణంగా నన్ను రేప్ చేసారు ముగ్గురూ...."

అయోమయంగా ఆమె వదనంలోకి చూసాడతను. మెదడు పుటలలో ఏదో జ్ఞాపకం మెదులు తోంది. నిర్వికారంగా చెప్పుకు పోతోందామె.

"ఆ అవమానం భరిస్తూ జీవించాలనిపించలేదు నాకు. బ్రతుకుపైన రోత పుట్టింది. అలల మధ్య ఆశ్రయం కోరాను. సాగర గర్భంలో కలిసిపోయాను...."

త్రుళ్ళిపడ్డాడతను

మూణ్ణెల్ల క్రితం వార్తాపత్రికలలో చదివిన వుదంతం గుర్తొచ్చిందతనికి హఠాత్తుగా

అంబిక అనే ఓ కాలేజ్ గర్ల్‌ని కొందరు రేప్ చేసి సముద్రంలోకి త్రోసేసారంటూ నగరమంతా అట్టుడికిపోయిన విషయం జ్ఞాపకమొచ్చిందతనికి. ఆమె దయ్యమయి మోటారిస్టులను పీడిస్తుందన్న విషయమూ గుర్తుకొచ్చింది.

స్టీరింగ్‌మీద చేతులు వొణుకుతూంటే వోరగా ఆమె వంక చూసాడతను. తెల్లచీరె, జాకెట్టూ విరబోసుకున్న జుట్టూ....

వదనంలో నిర్వికారం....ఏదో గాంభీర్యం....ఆమె....!?

భయంతో గుండెలు ఝల్లు మన్నాయి. నోరెండిపోయింది.

"ను, నువ్వెవరు...?" ఎలాగో గొంతు పెకల్చుకుని అన్నాడు.

అతని ప్రశ్నకు దెలికేయంలోలా నవ్విందామె. సుదీర్ఘమైన నవ్వది.

అతని గుండెలు ఆపే నవ్వు.

"ఇంకా గ్రహించలేదా? ఆ దురదృష్ట వంతురాలివి నేనే!" అందామె తాపీగా. "బలవంతపు చావు కారణంగా దయ్యమై పురుషులమీద కక్ష తీర్చుకునేందుకు ఇలా రాత్రులు ఈ బీచ్ రోడ్ లో తిరుగుతున్నాను. ఒంటరిగా వెళుతూన్న కారాపి ఎక్కుతూంటాను. డ్రయివర్ని రక్తం క్రక్కించి చంపి నా కసి తీర్చుకుంటున్నాను."

హఠాత్తుగా కారాగిపోయింది.

ఆమె పలుకులు ఆలకిస్తూన్నంత సేపూ భయంతో గజగజా వొణికి పోతున్నాడతను.

"బాబోయ్.....దయ్యం....!!" అంటూ భయంతో అరిచి సీటులో కూలిపోయాడు.

అతన్ని కదిలించి చూసిందామె. తరువాత ముక్కు దగ్గర చేతులు పెట్టి చూసింది. చావలేదు. ఇంకా నయం! నవ్వుకున్న దామె!

ఆ రాత్రి యూనివర్శిటీ సమీపంలో వున్న ఓ స్నేహితురాలి బర్త్ డే పార్టీకి వెళ్ళిందామె. అక్కడ అనుకోకుండా ఆలస్యమయిపోయింది. బస్‌గాని, టాక్సీగానీ దొరక్కపోతుందా అన్న ధైర్యంతో 'అన్నా' సమాధిదగ్గర కొచ్చి నిలుచుంది. ఎంతకూ టాక్సీ కూడా రాలేదు. అంతకంతకూ నిర్మానుష్యమవుతూన్న ఆ ప్రదేశంలో వొంటరిగా నిలుచోవడానికి భయం వేసిందామెకు. అంతలో ఆ కారు రావడమూ, లోలోపల భయంగా వున్నా గత్యంతరంలేక దానినాపి ఎక్కడమూ జరిగాయి. కాని, అతగాడు తనను రేప్ చేస్తాననడంతో ఆమె గుండె ఝల్లుమంది. లోలోపల ఆందోళనగా వున్నా నిభాయించుకుంది. ఆ సమయంలో అరిచి మొత్తుకోవడం వల్ల ప్రయోజన ముండదనీ, యుక్తితో ఆ ప్రమాదాన్ని తప్పించుకోవాలనీ అనుకుంది. ఫలితంగా మూణ్ణెల్ల క్రితం మద్రాసు నగరాన్ని అట్టుడికించిన 'అంబిక' అనే యువతి విషాధగాధను ఉపయోగించుకుంది. తాను 'దయ్యం' అని అతన్ని నమ్మించింది భయపెట్టే వుద్దేశ్యంతో.

తాను ధరించిన శ్వేతవస్త్రాలూ, ఫ్యాషన్ కోసం విరబోసుకున్న జుట్టూ....బాగా వుపకరించాయి తనకు. ఆమె కారు దిగి తన దారిన తాను బయలుదేరి వెళ్ళిపోయింది.

ఆ మర్నాటినుండి 'అంబిక' అనే దయ్యంపై ఎన్నెన్ని కథలు బయలుదేరతాయో ఊహకు అంద లేదు ఆమెకు. ✦